
సాలెగూడు
www.utopia.com
డా॥ చిత్తర్వు
మధు
FUN

# సాలెగూడు

## www.utopia.com



డా॥ చిత్తర్వు మధు

వాహిని బుక్ ట్రస్ట్

1.9.286/3 విద్యానగర్, హైదరాబాద్ 500044

**SAALEGOODU** *www.utopia.com*
*(Serialised in Andhra Prabha Illustrated Weekly)*
*by* ***Dr. Chittarvu Madhu***

First Edition : October, 2005

Publication No. 61

© Author

*Cover Disign :*
**BALI**

*Produced & Published by :*
**Vahini Book Trust (V.B.T.)**
1-9-286/3, Vidyanagar
Hyderabad - 500 044.

A
Service Oriented
Institution
Administrated
by
Y.V.S.R.S. SAI

*For Copies :*
Vahini Book Trust, 1-9-286/3, Vidyanagar, Hyderabad - 500 044.
Visalandhra Book House, Bank Street, Hyderabad & Other Branches
Navodaya Book House, Opp: Aryasamaj Mandir, Badi Chowdi, Hyderabad
Navayuga Book House, Sultan Bazar, Hyderabad.
Navodaya Publishers, Governorpet, Vijayawada.

*Typesetting :*
**Rachana Entinti Patrika,** Hyderabad - 500 044

*Printed at :*
**Charita Impressions,** 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020

Price : Rs. 50 /- US $ : 5



# సాలెగూడు

## www.utopia.com

“నేను వెళ్ళిపోతున్నాను. నీకు తెలుసుకదా, I am fed up. ఎవరికైనా సహనానికి ఓ హద్దుంటుంది. నీ కోసం చూసి చూసి, నీతో ఆర్గ్యుమెంట్స్ చేసి చేసి నీలో మార్పు రాదని రూఢి చేసుకుని చాలా రోజులైంది. చాలా సంవత్సరాలయింది. నీకు బహుశా నీ ప్రొఫెషన్ ముఖ్యం కావచ్చు. నాకు మాత్రం విసుగెత్తుతోంది. ఈ రోజు నవీన్ ఇంటికి రాలేదు. నువ్వూ రాలేదు. టి.వి. చూసీచూసీ, పాటలు వినీ వినీ, చల్లారిన డిషెస్ వేడి చేసీ వేడి చేసీ నా దౌర్భాగ్యానికి నాకే చిరాకు వేస్తోంది. అందుకే వెళ్ళిపోతున్నాను.

“ఎక్కడికీ అని అడక్కు. నాకు మార్పు కావాలి. నన్ను గౌరవించే ప్రేమించే ఒక్క వ్యక్తి కావాలి. పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనే యంత్రంలాగి చూసే భర్త కాదు. నా కోసం వెదకద్దు. leave me alone.

“నవీన్ ఇంటర్ సెకండియర్. ఎంసెట్‌కి చదువుతున్నాడు. కాని నేనేం చేయలేను. వాడ్ని నువ్వే చూసుకో నీలాగే డాక్టరు కావాలి అని కలలు కంటున్నావ్‌గా! ఇక ఇల్లంటావా నువ్వు లేకున్నా నడిచిపోతుంది. నీకు ఇష్టమైన పనులూ, వంటలూ చేసే యాదయ్య ఉన్నాడు. ఇల్లు శుభ్రంగా తుడిచి నీ కోసం కాచుకునే వెంకాయమ్మగారుంది. తోటమాలి రంగన్న నీ పూలతోటని చూసుకుంటాడు. ఇంక నీకేం కావాలి?”

“గుడ్‌బై! నన్ను మర్చిపో! ఈ రోజు సీరియస్‌గా వుందన్న నీ పేషెంటు బతికిందనుకుంటాను. కానీ, నేను సీరియస్ అవుతానని నువ్వు వూహించి వుండవు. నా కోసం వెదకద్దు! దిగులు పడద్దు! నాకు తోచినపుడు నేనే తిరిగి వస్తాను. నిన్ను అర్థం చేసుకోలేని...... స్వప్న”

వెంకాయమ్మగారు తలుపు చాటున నిలబడి “భోజనం బల్ల మీద రెడిగా వుంది బాబూ తినండి” అంటోంది. ఇంట్లో పనిచేసే యాదయ్య నిద్రకళ్ళు నలుము కుంటూ లోపలికి వచ్చి బల్ల దగ్గిర నిలబడ్డాడు.

కేన్సర్ పేషెంట్. లంగ్ కేన్సర్. సెకండరీస్ వూపిరితిత్తుల నిండా నిండిపోయి ఆయాసపడుతోంది. ఆమె బంధువులు భర్త పిల్లలు అందరూ ఎక్యూట్ కేర్ యూనిట్ దగ్గర విలపిస్తో నిలబడే వున్నారు. మరి చివరిక్షణాల దాకా ఏదో చేయాల్సిన చికిత్స చేయాలి గదా. ఏడు గంటలకు ఫోన్ చేశాడు లేటవుతుందని.

టైమ్ చూసుకున్నాడు. 1.30. దీనికే స్వప్నకి ఇంత కోపం వచ్చేసింది. ఇది

మొదటిసారి కాదు. అలిగి వెళ్ళిపోవడం మామూలే.

"ఏమన్నా కావాలా సార్" యాదయ్య అడుగుతున్నాడు.

"ఏం వద్దు యాదయ్యా నిద్రపో పోయి" అన్నాడు. "వెంకాయమ్మగారు మీరూ పడుకోండి. నేను కొద్దిగా తిని పోయి రెస్ట్ తీసుకుంటాను డోంట్ వర్రీ...."

అతనికి నిజానికి ఆకలిగా లేదు. కొద్ది నిముషాల క్రితమే ఆ పేషెంట్ చనిపోయింది. డెత్ సర్టిఫికెట్ సంతకం పెట్టి ఇచ్చి వచ్చాడు. కారు హాస్పిటల్ గేట్ దాటుతోంది. వెనకాల కోరస్‌గా ఏడుపులూ అరుపులూ. నిశ్శబ్దంగా ట్రాఫిక్ లేని రోడ్ల మీద కారు డ్రైవ్ చేసుకుంటూ వస్తోంటే మనసులో ఏవో నిర్లిప్తత. యుద్ధంలో ఓడిపోయిన తర్వాత మిగిలే అలసట. ఒకరకంగా రిలీఫ్.

ఏ పేషెంట్ పోయినా తను ఎందుకు ఇలా రియాక్ట్ అవుతాడు. అతను ఆలోచిస్తున్నాడు... తేలికగా ఎందుకు తీసుకోలేకపోతున్నాడు... ఇంత ఆలస్యం అయినా ఇంకా ఏదో చేశానన్న తృప్తి మిగిలింది. కానీ ఇంటికి వచ్చేసరికి ఈ షాక్ ట్రీట్‌మెంట్ ఏమిటో! కోపంగా వెళ్ళిపోయిన స్వప్న ప్రవర్తన ఏదో కత్తితో గుండెని గీరినట్లు అనిపిస్తోంది.

ఎంతరాత్రి అయినా నిద్రలో తన కోసం మేలుకుని తనకి తిండిపెట్టడం కోసం ఎదురుచూసే ఈ ఇద్దర్ని చూస్తే వింతగా ఉంది. ఒకే సంఘటనకి వేరు వేరు వ్యక్తులు ఎంత వేరుగా స్పందిస్తారో.

గడియారం రెండు గంటలు కొట్టింది.

"నవీన్ వచ్చి పడుకున్నాడా?" అడిగాడు హఠాత్తుగా, స్పూన్‌తో కొద్దిగా ఫ్రైడ్ రైస్ నోట్లో పెట్టుకోబోతూ....

"నవీన్‌బాబు కూడా ఆలస్యంగా వస్తానని ఫోన్ చేసిండు బాబూ. ఇంతవరకూ రానేలేదు" యాదయ్య చెప్పాడు.

తినేవాడల్లా ఆగిపోయాడు అరుణ్. మరొక షాకింగ్ న్యూస్. ఇంతవరకు నవీన్ ఏం చేస్తున్నట్లు? నీరసంగా కొద్దిగా అన్నాన్ని గడ్డి నమిలినట్లు నమిలి, పెరుగు వేసుకుని తిని మంచినీళ్ళు గటగటా తాగేశాడు.

"ఎక్కడికి వెళ్ళినట్లు నవీన్? కోచింగ్ సెంటర్ ఏడున్నరకే మూసేస్తారు కదా" తనలో తను అనుకుంటున్నట్లు అన్నాడు.

ఎవరూ మాట్లాడలేదు.

అరుణ్‌కి తల దిమ్ముగా ఉంది. ఆలోచించే ఓపిక లేదు. చనిపోయిన కేన్సర్ పేషంట్ ఇంకా కళ్ళముందు మెదలుతోంది. 'ఓ గాడ్, నా డ్యూటీ నేను నాకు తృప్తిగా నిర్వర్తించినందుకు ఇన్ని శిక్షలా. ఎక్కడికో చెప్పకుండా వెళ్ళిపోయిన భార్య. కోచింగ్‌కని వెళ్ళి రాత్రి రెండు గంటలయినా తిరిగి రాని కొడుకు.'





"నేను పోయి పడుకుంటా నవీన్ వస్తే నన్ను పిలువ్ మాట్లాడాలి – అసలు ఎందుకింత ఆలస్యం అయిందో" డాక్టర్ అరుణ్‌కి నిద్రమత్తుగా ఉంది. "మీరు తలుపులు వేసుకని పడుకొండి. జాగ్రత్త" అని చెప్పి నీరసంగా మెట్లు ఎక్కి బెడ్‌రూమ్‌లోకి ప్రవేశించాడు.

నిద్రలోకి జారుకునే ముందు అనుకున్నాడు – 'ఇది ఎంతోకాలం సాగదు. ఈ పరిస్థితులు మారాలి. ఈ ఇంట్లో ఇంత అశాంతీ, అసంతృప్తి, ఇవన్నీ పోవాలి ..... దీనికి కారణం నేనే అయితే.... బహుశా నాలోనే మార్పు రావాలి. రేపట్నించే ఆ మార్పు రావాలి'

❁ ❁ ❁

"నిన్ను ఇబ్బందిపెడుతున్నానా?"

ధారగా పడేవాన. కారు అద్దాల మీద నిరంతరం లయబద్ధంగా నీటిని తుడవడానికి శ్రమిస్తోన్న వైపర్స్.

అతను మాట్లాడలేదు నిశ్శబ్దంగా డ్రైవ్ చేస్తున్నాడు. స్వప్న అతని భుజం మీదుగా చేయి పోనిచ్చి బతిమాలుతున్నట్లు అంటోంది.

"సారీ శ్రవణ్! ఈ రోజు అసలు మూడ్ బాగా లేక అతనికి లెటర్ రాసిపెట్టి వచ్చేశాను. ఎంతో కసిగా ఉంది. ఎక్కడికో పోవాలని ఉంది. ఏదో చేయాలని ఉంది...... అందుకే నీకు ఫోన్ చేశా. నీకిబ్బంది కలిగిందేమో..."

శ్రవణ్ కుమార్ మనసులో అనుకుంటున్నాడు – 'ఎందుకు ఇబ్బందిగా ఉండదు. ఇంట్లో భార్యకి ఇద్దరు పిల్లలకీ అనుమానం రాకుండా హఠాత్తుగా వానలో ఈవిడ కోసం రావడం.... అంత తేలికైన పని కాదు' కాని, కాని పైకి మాత్రం "స్వప్నా... అలా అనకు నువ్వు ఎంత బాధలో ఉండి పిలిచావో నాకు తెలుసు" అన్నాడు.

"ఏం చేద్దాం?" అంది స్వప్న కొంచెం తియ్యగా.

అలాగే అంటుంది. ఆమె అందానికి పిచ్చివాడైన తనని ఇలానే ఆడిస్తోంది. కానీ అందీ అందనట్లు దగ్గరయి దూరం అయిపోతుంటుంది.

"ఏమో నాకేం తెలుసు. నువ్వు ఎందుకు పిలుస్తావో, ఏం కావాలో, నాకు మాత్రం కావాల్సింది ఒక్కటే!"

ఆమె సడన్‌గా నిస్తబ్ధురాలైంది. అందరూ మగవాళ్ళు కోరేది ఒకటే. తనకేం కావాలో ఇతనికీ తెలియదు. కాని అరుణ్ మీద కోపం తారాస్థాయిలో వుంటే పిలిచేది ఇతన్నే. అరుణ్ అంత అందంగా లేకపోయినా కొంచెం యంగ్‌గా ఉంటాడు. ఎక్కువగా తనకి ఎదురు మాట్లాడడు. ఎలా చెబితే అలా వింటాడు. తనకంటే పదేళ్ళు చిన్నవాడేమో. అరుణ్ పనిచేసే హాస్పిటల్‌లోనే వేరే డిపార్ట్‌మెంట్‌లో ఎనస్థటిస్ట్‌గా

పనిచేస్తున్నాడు.

ఓ పార్టీలో పరిచయం చేశాడు అరుణ్. తర్వాత ఒకటి రెండుసార్లు ఏవో కాన్ఫరెన్స్ కోసం అరుణ్‌తో కలిసి వెళ్ళినప్పుడు ఇంకా ఎక్కువ పరిచయం అయ్యాడు. ఎందుకంటే హిందీ సినిమాల గురించీ, పాటల గురించి మంచి నాలెడ్జి ఉంది అతనికి. తనకీ అదే యిష్టం.... అలా అలా ..... అరుణ్ లేనప్పుడు రెండుసార్లు ఇంటికి రమ్మని పిలిచింది.

అతనికి పెళ్ళయిందని తెలుసు. అతనికీ తన గురించి తెలుసు. అయినా వచ్చేవాడు.

అతను వచ్చేసరికి కావాలని ఎక్కువగా అలంకరించుకునేది. ఫర్ఫ్యూమ్ చల్లుకునేది. ఆకర్షణీయంగా తయారయేది.

ఒంటరితనం..... మాటలు...... కబుర్లు..... తర్వాత అతను మెల్లగా ఏదో చేద్దామని ప్రయత్నం చేసేవాడు.

"ఐ లైక్‌యు స్వప్నా. మీ మాటలు వింటుంటే జలతరంగిణి సంగీతం వింటున్నట్లుంటుంది."

భుజం మీద చేయి వేసుకుని తన వైపు తిప్పుకునేవాడు.

ఓసారి ముఖానికి దగ్గరగా వచ్చి పెదవులతో తన పెదవులు స్పృశించడానికి ప్రయత్నం చేస్తూ....

సీరియస్‌గా చూసేది. మళ్ళీ భయపడి వెనక్కి తగ్గేవాడు.

నవ్వేసేది. మాట మార్చి మళ్ళీ ఏవో ఓ పాట అందుకునేది. కాసేపటికి అరుణ్ వచ్చే టైం అనేది. లేదా నవీన్ కాలేజి నుంచి వచ్చేవాడు. అంతటితో అతను వెళ్ళిపోయేవాడు.

కానీ అతనికి కావాల్సిందేమిటో తనకి తెలుసు. అతనికి అందీ అందనట్లుగా అయి ఏడిపిస్తోందని తెలుసు. ఇంకా ఎన్నాళ్ళు ఇలా జరుగుతుంది?

తనపైన తనకే ఏవో అభద్రతాభావంతో శారీరకంగా దగ్గరయితే ఇతనికి తన మీద మోజు పోతుందేమో! అయినా ఈ పైపై మెరుగులు కింద తొలగించినాక, తన నిజమైన ముడతలుపడిన పొట్టా...... ఏముంటుంది అతనికి ఆకర్షణగా...

వివాహ జీవితంలో పదిహేను ఏళ్ళు గడిచిపోయి, అన్నీ అనుభవం అయినాక ఇంక ఆసక్తి ఏం వుంటుంది?

అతనికీ పెళ్ళయిందిగా? మరి అతనికి మాత్రం ఎందుకు ఈ ఆత్రం?

అది జరిగిపోతేనే స్నేహానికి పరిపూర్ణతా! మగాళ్ళకి కావాల్సింది అదే. స్త్రీ పూర్తిగా కావాలి. అనుభవించాలి. అప్పుడే అతనికి పూర్తిగా తృప్తి దక్కుతుంది.

తనకి కావాల్సింది శారీరకం కాదు. ప్రేమ, ఆప్యాయత, సామీప్యత... ఈ





ఒంటరితనపు విషాదంలోంచి బయటపడేసే, అద్భుతమైన స్నేహం అది అతనికి ఎలా తెలుస్తుంది? "ఏదయినా చివరికి జరిగేది ఒకటే కదా" అని నవ్వాడు. ఒకసారి. అతని కళ్ళల్లో మెరిసిన ఎరుపు జీరతో అతనికి సహనం హద్దులు దాటుతోందని అర్థం అయింది.

కారు మెత్తగా రోడ్డు మీద జారిపోతుంది.

"హోటల్ గ్రాండ్ షెరటన్‌కి పోనీయ్" అంది గీరగా.

"ఎందుకు? ఆకలిగా ఉందా?"

"ఆc.. అక్కడ మెక్సికన్ ఫుడ్ ఫెస్టివల్‌లో తిని డిస్కోకి వెళ్దాం."

"నీకేమన్నా పిచ్చిపట్టిందా నీ వయస్సు నలభై స్వప్నా. నాకూ అంతే అనుకో. ఇద్దరం డిస్కోలో ఎగరగలమా?"

"వైనాట్? నాకు ఎంజాయ్ చేయాలని వుంది. ప్లీజ్ తీసుకెళ్ళవా!"

"వొద్దు."

"నిర్మానుష్యంగా ఉంది. అటూ ఇటూ చెట్లు వానలా తడిసి నల్లగా నీడల్లా వున్నాయి. కరెంట్ తీసేశారు. అతను విసురుగా కారుని మెయిన్ రోడ్డు పక్కనున్న గల్లీలోకి పోనీచ్చి ఓ వీధి చివర పేవ్‌మెంట్ పక్కగా ఆపాడు.

"ఏమిటిది? ఆపేశావ్ పోనీ" అంది గోముగా స్వప్న.

"నేను పోను. నిన్ను పోనీయను" శ్రవణ్ స్టీరింగ్ వదిలేసి తన రెండు చేతులతో ఆమె ముఖం గట్టిగా పట్టుకుని దగ్గరకానుకుని పెదాల మీద గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

షాక్ తింది స్వప్న. వూపిరాడడం లేదు. ఈ అనుభవం ఇబ్బందిగా ఉంది. అతని చేతులతో ఆమె భుజాలు పట్టుకుని దగ్గరకు లాగుతున్నాడు. ఎక్కడెక్కడో తడుముతూ స్పర్శిస్తూన్నాడు. పెదాలు ముఖమంతా ముద్దులతో ముంచెత్తుతున్నాయి.

"ఏమిటీది శ్రవణ్ వదులు వదులు" అరిచింది గట్టిగా.

"వదలడానికి కాదు నిన్ను తీసుకొచ్చింది! వదిలించుకోడానికి కాదు నువ్వు నన్ను పిలిచింది. ప్లీజ్ స్వప్నా కమాన్!" అతను ఆమెని ఒక చేత్తో వక్షోజాల మీద తడుముతూ మరొక చేయి నడుం మీదకి పోనివ్వసాగాడు.

"నోనో, నాకు ఇష్టం లేదు. శ్రవణ్ ప్లీజ్ వదులు – పోనీ"

"వద్దంటే ఎవరు నమ్ముతారు. నీకు నేనంటే ఇష్టం. నాకు నువ్వంటే ఇష్టం – కమాన్ ఎంత బావుంటుందో చూడు – మనిద్దరం కార్లో ఒంటరిగా.... యిటు వాన ధారగా.... ఇంతకంటే థ్రిల్ ఏముంది చెప్పు?"

అతని చేతుల్లో ఇనుప చేతుల బలం ఆమెకి ఎందుకో దుర్భరంగా ఉంది.

మత్తు దిగినట్లయింది. ఏంచేస్తోంది తను. ఎలాగైనా తప్పించుకుని వెళ్ళిపోవాలి.

ఇంట్లో నవీన్ వచ్చి ఉంటాడు. అరుణ్ లేట్‌గా వస్తానని ఫోన్ చేశాడు. తాను చేసిన పని ఏమిటి? ఇది వద్దు! వెళ్ళిపోవాలి...! శ్రవణ్ ఆగడం లేదు.

ముందు సీటు అమాంతంగా వంచేశాడు. ఆమె మీద మోకాళ్ళ మీదుగా వున్న చీరని పైకి లాగేస్తున్నాడు. ఇంకొ పక్క ముఖాన్ని అదిమి ముద్దులతో గట్టిగా నొక్కేస్తున్నాడు.

మైగాడ్ ఇదేం పరిస్థితి!?

వర్షం ధారగా కురుస్తోంది. తానే అతనికి ఈ అవకాశం ఇచ్చింది. అతని తప్పు లేదు. తన మీద కోరిక కలిగేట్లు రెచ్చగొట్టింది.

కాని... తనకి ఇది వద్దు.... ఇప్పుడు తెలిసిపోయింది. కావాల్సింది ఇది కాదు.

"నో..... నో... ఐడోంట్ వాంట్‌దిస్ .... లే.... నా మీద నుంచి లే.... కమ్‌టు సెన్సెస్. గెటప్" ..... బతిమాలుతూ పెనుగులాడసాగింది.

❁ ❁ ❁

"పన్నెండయింది. ఇక వెళ్ళిపోరాదా?" అడిగాడు యాదగిరి.

.... నవీన్ వులిక్కిపడి అతనికేసి చూశాడు. ఎదురుగా కంప్యూటర్ మానిటర్‌లో వున్న స్క్రీన్‌ని ఆటోమాటిక్‌గా అతని వేలుతో క్లోజ్ క్లిక్ చేసి వేరే ఛానెల్‌లోకి మార్చింది.

మిలీనియం సైబర్ కేఫ్ యజమాని ఎప్పుడూ ఎవర్ని వెళ్ళిపోమని చెప్పడు. ఎందుకు చెబుతాడు? అతనికి ఎంత ఎక్కువ మంది ఎన్ని ఎక్కువ గంటలు ఇంటర్‌నెట్ బ్రౌజ్ చేస్తూ గడిపితే అంత ఎక్కువ లాభం.

నవీన్ లేతగా సన్నగా అమాయకంగా వున్నాడు. అతను చూసే సైట్ ఏదో అశ్లీలంగా ఆడపిల్లల బొమ్మలు చూసే పోర్నోగ్రాఫిక్ సైట్ అని యాదగిరికీ తెలుసు. ఈ టీనేజర్స్ అంతా వచ్చేది అందుకే. అదే బిజినెస్ అతనికి అని కూడా తెలుసు.

కాని ఈ నవీన్ సాయంత్రం నాలుగ్గంటలకి వచ్చి ఇప్పటి దాకా కూర్చునే వున్నాడు. అందుకని అప్రయత్నంగానే అడిగేశాడు యాదగిరి, అది వృత్తిధర్మం కాకపోయినా. నవీన్ వాచి చూసుకున్నాడు.

"అరే! టైం చాలా గడిచిపోయింది. ఎన్‌సైక్లోపిడియా బ్రిటానికా చూస్తుంటే కాలం గడిచిపోయింది. అయినా యాహూ చాలా స్లో వుంది ఈ రోజు – సంజాయిషీ చెపుతున్నట్లు అన్నాడు – "ఎంత?"

"వెయిట్" అని బుక్ చూసి చెప్పాడు యాదగిరి – "160 రూపీస్ ఎయిట్ అవర్స్‌కి."

ఆ డబ్బు అతనికిచ్చేసి బయటపడ్డాడు నవీన్. అతనికి ఇంకా ఇంటికి వెళ్ళాలని లేదు. ఈ రోజు కోచింగ్ సెంటర్‌లో వీక్లీ టెస్ట్ రిజల్ట్స్ ఇచ్చారు. బయాలజీ ఫిజిక్స్,





కెమిస్ట్రీ అన్నిట్లో తక్కువ మార్కులు వచ్చాయి. చాలామందికి నూటికి తొంభై మార్కులు వస్తే తనకి అరవై అరవై అయిదు దాటడం లేదు. ఇంటికి వెళ్ళగానే డాడీ దీని గురించి అడగటం తిట్టడం ఖాయం. మళ్ళీ పెద్ద గొడవ. మమ్మీ అరుపులూ, తనకి ఏం సమాధానం చెప్పాలో తెలీక రూమ్‌కి వెళ్లి నిశ్శబ్దంగా కూర్చోవడం.

దీనంతటికీ బదులు సైబర్ కేఫ్‌లో ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేస్తుంటే మనసుకి చాలా రిలీఫ్ అనిపిస్తుంది. కాలం ఎంత బాగా గడిచిపోతుంది!

నవీన్ సైబర్ కేఫ్ బయటికి వచ్చి పేవ్‌మెంట్ మీద నిలుచున్నాడు. వీధి దీపం క్రీనీడలో అతని బైక్ పార్క్ చేసి ఉంది.

కొంచెం సేపు ఆలోచించి, మళ్ళీ బైక్ స్టార్ట్ చేశాడు.

రాత్రి పన్నెండు దాటింతర్వాతయినా ఇంటికి వెళ్ళకపోతే ఎలా?

అతనికి హఠాత్తుగా. ఏదో నిస్పృహ ఆవరించింది. ఇంట్లో ఎప్పుడూ గొడవలే. ఎప్పుడూ "చదువుకో, ఇంకా మార్కులు రావాలి," అని తిట్టే డాడీ; "నీ చదువు సంగతి నా కనవసరం ఇష్టం వచ్చినట్లు చేసుకో" అనే మమ్మీ.

అసలు వాళ్ళ ముఖాల్లో తనంటే ప్రేమే కనబడదు.

'ఇద్దరికీ ఎప్పుడూ గొడవ పడడమే సరిపోతుంది. ఇక నా సంగతి ఏం పట్టించుకుంటారు' అనుకున్నాడు కసిగా.

రోజుకు కనీసం రెండయినా కొత్త వెబ్‌సైట్లు చూడందే నవీన్‌కి తోచదు. వాటిలో న్యూస్, మేగజైన్స్, సినిమాలవి కాకుండా, సెక్స్, పార్నోగ్రఫీ కూడా వున్నాయి. కానీ అవి కూడా చూసి చూసి అతనికి విసుగెత్తిపోయింది.

ఏదో కావాలి. ఇంకేదో థ్రిల్ కావాలి. ఈ ప్రపంచంలో అన్నింటికీ మించినది, విలువైనదీ ఇంకేముందో తెలుసుకోవాలి.

ఈ రోజు కూడా తన ప్రశ్నలకి సమాధానాలు తెలియజేసే ఒక వెబ్‌సైట్ చూశాడు. తన కోసమే తయారుచేసినట్లుంది ఆ సైట్.

"జీవితంలో నిరాశ చెందారా? మీ లక్ష్యం మీకే తెలియడం లేదా? కమ్‌టు యుటోపియా! ఇది వూహాతీతమైన మరో ప్రపంచం రండి. ఇక్కడ మీ సమస్యలన్నిటికీ పరిష్కారం దొరుకుతుంది. అతి త్వరలో ఈ విశ్వపు రహస్యాలకి అర్థం తెలుసుకోవచ్చు. కమ్! రండి ఒకసారి దర్శించండి!"

నవీన్ మనసులో, కళ్ళల్లో ఆ సందేశం, మెరిసే "ఏనిమేటెడ్" అక్షరాలు పదే పదే కనిపిస్తున్నాయి.

"టు హెల్ విత్ ఎవ్విరి థింగ్" విసురుగా స్కూటర్ స్టార్ట్ చేశాడు" అదేంటో తెలుసుకోవాల్సిందే.

❁ ❁ ❁

కలతనిద్రలో...... ఫ్లాష్‌బ్యాక్‌లో దృశ్యాలు మెదడు తెర మీద కదిలి పోతున్నాయి.

పెళ్ళిరోజు. రిసెప్షన్. అపుడే ఇంగ్లండు నుంచి తిరిగి వచ్చి ఆదర్శాలతో, ఆశయాలతో తను. సన్నగా మెరుపు తీగలాగా తన పక్కన పట్టుచీరలో స్వప్న.

విదేశాల్నించి తిరిగి వచ్చినాక, తన తల్లిదండ్రులు పెళ్ళి చేసుకోవాల్సిందే అని ఒత్తిడి చేశారు.

ఎందుకంటే ఒక పరిస్థితిలో అసలు పెళ్ళి చేసుకోకుండా కేన్సర్ ట్రీట్‌మెంట్‌కే అంకితమైపోదామనుకున్నాడు.

డబ్బు...... జీవితం.... ఇతర సుఖాల గురించి తెలియని రోజులవి.

ఏదో చేయాలి! సాధించాలి! వైద్యరంగంలో పేరు తెచ్చుకోవాలి, పేషంట్లని మెప్పించాలి అనే ఆదర్శం.

.... ఇప్పుడేమయ్యాయి అవన్నీ.....?

"డాక్టర్ భార్యగా వద్దు" అని చెప్పేశాడు తల్లితండ్రులకి.

'ఇద్దరూ సంపాదిస్తే ఎక్కువ డబ్బులు మిగులుతాయ్ కదా' అనబోయిన అమ్మ వంక కోపంగా చూసి, "నాకు ఇల్లు చూసుకునే గృహిణి కావాలి. నాలాగానే హాస్పిటల్‌కి పోయి రోగులతో అవస్థ పడే లేడీ డాక్టర్ కాదు" అని చేప్పాడు.

దానికంటే తన మనసులో ఇంకా ఎవరికీ తెలియనిది, అర్థం చేసుకోలేనిది.. తనకి ప్రేమ కావాలి. ఇంటికి రాగానే తన అవసరాలని, ఆదర్శాలని అర్థం చేసుకునే సహృదయిని కావాలి అని మనసులో ఉంది. పెళ్ళయిన మొదటి సంవత్సరం.... హాయిగా కలలాగానే గడిచిపోయింది..... కొత్తగా ప్రాక్టీస్ పెట్టడం, పేషెంట్ల కోసం చూసి చూసి ఎవరూ రానప్పుడు త్వరగా ఇంటికి రావడం... ఏదయినా సెకండ్ షో సినిమాకి వెళ్ళడం.. అదొక డ్రీమ్‌లాగా గడిచిపోయింది.

ఓ సంవత్సరానికి స్వప్నకి ప్రెగ్నెన్సీ వచ్చింది. మరో సంవత్సరానికి నవీన్ పుట్టి మూడు నెలలయిపోతోంది. వాడిని చూసి పెంచుకునే ఆనందంలో మరో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి.

..... నిట్టూర్చాడు. అరుణ్. ఆ రోజులకీ ఇప్పటికీ ఎంత తేడా...

మూడు సంవత్సరాలకి తన ప్రాక్టీస్ పెరగడం మొదలయింది నగరంలో మంచి కేన్సర్ ఆసుపత్రిలో ఉద్యోగం. వాళ్ళని చూస్తుంటే మళ్ళీ తన ఆదర్శాలూ నెరవేరుతున్నట్లు వాళ్ళ ఆశల్లో, సంతోషాల్లో, దుఃఖాల్లో తనూ భాగం పంచుకున్నట్లు – ఇలా ఇలా వృత్తిలో నిమగ్నమయిపోయేవాడు.

వాళ్ళకి వచ్చే సమస్యలు వర్ణనాతీతంగా ఉండేవి. తగ్గిందనుకున్న జబ్బు మళ్ళీ సెకండరీస్‌గా రావడం... తగ్గదనుకున్నప్పుడు డ్రమటిక్‌గా రిలీఫ్ రావడం, ఎక్కడెక్కడి వూర్ల వాళ్ళో ఆశతో, సజల నయనాలతో తన పేరు విని తన కోసం చికిత్సకి





రావడం – ఇవన్నీ తనికి మంచి అనుభూతిని ఇస్తుంటే..... తన రోటీన్ మారిపోయింది. ఉదయం నుంచి రాత్రి పదకొండు దాకా కేన్సర్ హాస్పిటల్‌లోనే...

... ఈ లోపల ఎక్కడో ఎప్పుడో స్వప్న తనకి ఎమోషనల్‌గా దూరం అయింది.

మొదట అసంతృప్తి మాటల్లో కనిపించేది. "ఛీ.... ఇదేం ఇల్లు... అద్దెకొంప.... డాక్టరు వుండవలసిన ఇల్లులా లేదు....."

"ఈ మారుతీ కారు డొక్కు డొక్కు అయిపోయింది, మొన్న డాక్టర్ సత్యనారాయణగారి భార్య పిలిస్తే షాపింగ్‌కి హోండా సిటీలో వెళ్ళాను. దానికీ దీనికీ అసలు పోలికే లేదు. ఎద్దుల బండిలా ఉంది."

"సి.డి. సిస్టమ్‌లో పాటలు వింటూ ఎసీ హాల్లో కూర్చునే భాగ్యం మనలాంటి వాళ్లకి వుండదు కదా"

నవీన్ యు.కె.జీ., ఎల్.కె.జీ. అయిపోయి మెల్లగా స్కూల్లో ముందుకు పోతున్నాడు. వాడిని పొద్దున్న తయారుచేసి స్కూలుకి పంపడానికి కూడా ఆమెకి విసుగ్గా ఉండేది.

'ఒంటరితనం. పైగా నవీన్ తర్వాత మళ్ళీ పిల్లలు కలగలేదు. ఏదో సెకండరీ స్టెరిలిటీ ప్రాబ్లెం వచ్చింది. తను హాస్పిటల్‌కి అంకితం అయిపోయాడు. కాబట్టి ఆమెలో ఈ ప్రవర్తన సహజం' అని  సరిపెట్టుకున్నాడు.

'జీవితంలో తృప్తి కావాలంటే డబ్బు కూడా సంపాదించాలి' అని అర్థం చేసుకున్నాడు. కాబట్టే ఇచ్చిన వాళ్ళ దగ్గర ఫీజులు ఎక్కువ చేశాడు. క్రమంగా ఓ పథకం  ప్రకారం ఇంద్రా హిల్స్‌లో ఓ బంగళా పెద్ద కారూ ఎస్టీమ్' కొన్నాడు. ఈ కార్యక్రమానికి నాలుగేళ్ళు పట్టింది. ఎక్కడ్నించో చదువుకని వచ్చిన అనాథ పిల్లవాడు యాదయ్యని ఇంట్లో పనులకి పెట్టుకున్నాడు. కిడ్నీ ప్రాబ్లంతో భర్త పోయి, తన పిల్లలే తనని చూడకుండా తరిమేసిన వెంకాయమ్మగార్ని ఇంట్లో వంటకి కుదిర్చాడు. స్వప్నకి ఏ పనీ ఉండకూడదనుకునీ శ్రమపడకూడదు అనే–...

నవీన్‌ని ఇంటర్మీడియట్ చాలామంచి పేరున్న గోల్డ్ ఫ్లవర్ కాలేజీలో చేర్చాడు. వాడు మెడిసిన్ చదవాలని, వూళ్ళో పేరుపొందిన వివిఎస్ కోచింగ్ సెంటర్‌లో చేర్చాడు.

ఐదొందల గజాల స్థలంలో పెద్ద అధునాతనమైన అద్భుతమైన బంగళా. చుట్టూ పూలచెట్లు... లోపల రూము రూములో ఏసీ, పెద్ద కలర్ టివీ, సిడి ప్లేయర్, కార్పెట్స్, పెయింటింగ్స్, పాలరాతి నేల, షవర్‌బాత్‌లు, బాతింగ్ టబ్స్, వాషింగ్ మెషిన్.  ఓవెన్ అన్నీ ఒక్కటొక్కటే సమకూర్చుకున్నాడు.

కాని.... ఆమెలో ఏదో అసంతృప్తి, వెలితి. తన మీద హేళన.

"మీరేం సాధించారని వాడిని మళ్ళీ మెడిసిన్ కోసం ట్రై చేయమంటారు? ఆ సీట్ రాకపోతే మళ్ళీ ఎన్ని లక్షలు ఖర్చు పెట్టి ఎడ్మిషన్ తెచ్చుకోవాలో. చదివినా

ఆదాయం శూన్యం కదా..."

"కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివిస్తే అమెరికా వెళ్లి విపరీతంగా డాలర్స్ పట్టుకువస్తాడు కనీసం ఆ పని మీరు చేయకపోయినా వాడు చేసేవాడు కదా..."

నవీన్ తన కొడుకు. వాడికి మెడిసిన్ చెప్పించడం అతి సహజం. ఆటోమాటిక్‌గా అనుకున్నాడే కాని ఇంత దూరం ఆలోచించలేదు. దానిలోని ఆర్థిక సూత్రాలు తనకి అవగాహన కాలేదు.

వాడయినా తనకి మెడిసిన్ ఇంట్రస్ట్ లేదు అని చెప్పినా తనకి తెలిసేది.

"మీ ఇష్టం డాడ్" అన్నాడు. "వాడికి భవిష్యత్తు లేదు" అనేసేది స్వప్న. తనకి చాలా కోపం వచ్చింది. ఈ వృత్తిలోని గొప్పదనాన్ని ఆమెకి ఎలా నచ్చచెప్పడం? తన వృత్తిని డబ్బుతో కొలవమంటే ఎలా?

జబ్బు తగ్గిపోయిందని చెప్పినప్పుడు వృద్ధురాలి కళ్ళల్లో ఆనందం, ఆమె ఇచ్చే ఆశీర్వచనాలూ... నొప్పితో బాధపడే వాడికి ఉపశమనం ఇచ్చేటప్పుడు ఆ వ్యక్తి రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేస్తుంటే తనలో దైవత్వం లేకపోయినా ఆ వ్యక్తి కళ్ళలో ఆరాధనకి చలించిపోవడం –

ఇవన్నీ ఎలా తెలుస్తాయి స్వప్నకి.

"ఈ ప్రపంచంలో అతి పవిత్రమైన మహోన్నతమైన విధి డాక్టర్‌ది. అతని వృత్తిది – అన్న విలియం ఆస్లర్ మాటలు గుర్తు చేసేవాడు. స్వప్నకీ, నవీన్‌కి ఈ వృత్తిలోని మహత్తరమైన విలువలు చెప్పడానికి ప్రయత్నం చేసేవాడు.

ఆమె నవ్వేసేది – "ఎందుకూ? ఇండియాలో బీదవాళ్ళెక్కువ. ప్రతి వాడూ అవసరం వచ్చినప్పుడు దండం పెట్టి నువ్వు దేవుడివని, దేవుడి లాంటివాడివనే అంటూంటారు... ఇన్ని కబుర్లు చెపుతారు.... మీ బెంక్ బాలన్స్ ఎంత వుందో చెప్పండి నిజాయితీగా....?"

నిజమే నెల నెలకీ కారుకీ, ఇంటికీ ఇతర వస్తువులకీ లోన్ ఇన్‌స్టాల్ మెంట్స్ తీరితే మిగిలేది ఏం ఉంటుంది? ఏమీ లేదు!

అయినా అన్నీ నెగిటివ్‌గా ఆలోచించుకునే వాళ్ళని ఎంతవరకు తృప్తిపరచగలం!

ఒక కారుంటే రెండు కార్లు కావాలనిపిస్తుంది. ఒక ఇల్లుంటే రెండు ఇళ్ళు కావాలనీ, ఈసారి ఇండియాలో హాలీడే తిరుపతికనే వెళ్ళితే, అందరూ సింగపూర్ వెళ్తున్నారనీ, నగలు కొంటే ఇంకా నగలు కావాలనీ...

ఈ విమర్శలు వస్తూనే ఉండేవి. ఫలితంగా ఇద్దరికీ వాగ్వాదం, చర్చలు, విసురుగా వెళ్ళిపోవడం... ఎక్కడో తిరిగి రావడం.. మళ్ళీ కొన్నాళ్ళు నిశ్శబ్దం... తర్వాత తిరిగి కొన్నాళ్ళకు మళ్ళీ ఇవే సంఘటనలు రిపీట్ అనడం... అలవాటయి





పోయింది.

'ఎంతోమంది రోగుల మానసిక శారీరక రుగ్మతలని అర్థం చేసుకుని అధ్యయనం చేసే డాక్టరు! నీ భార్య మనసులో ఏం ఉందో ఎందుకు అర్థం చేసుకోలేక పోతున్నావ్? ఆమెని ఎలా సంతోషంగా ఉంచాలీ?'

డాక్టర్ అరుణ్ నిద్రలో మేలుకున్నాడు. మనసంతా అల్లకల్లోలంగా ఉంది. విసుగ్గా ఉంది. లేచి ఫ్రిజ్‌లో నీళ్ళు తీసుకుని తాగి మంచం అంచున కూర్చుని తల రెండు చేతుల్లో పెట్టుకుని ఆలోచించసాగాడు. ... సమయం ఉదయం రెండు గంటలయింది.... అప్పుడే టెలిఫోన్ మోగింది. ఆ సమయంలోనే కాలింగ్ బెల్ మోగింది...

అటూ యిటూ – ఎటు వెళ్దాం అని ఆలోచిస్తూ అరుణ్ వుండగానే క్రింద యాదయ్య లేచి తలుపు తీసే చప్పుడు వినిపించింది. నవీన్ వచ్చి ఉంటాడు అనుకుని ఫోన్ తీశాడు.

"హలో నేను డాక్టర్ అరుణ్‌కుమార్‌ని"

"నమస్తే సార్ ఇది పటేల్ నగర్ పోలీస్‌స్టేషన్"

"పోలీస్ స్టేషనా... ఏమయింది చెప్పండి...."

"ఒక స్త్రీ రోడ్డు పక్క స్పృహ తప్పి పడి ఉంటే తీసుకుని వచ్చాం. ఇపుడు ఆమెకి తెలివి వచ్చింది. పేరు స్వప్న కుమారి, వైఫ్ ఆఫ్ డాక్టర్ అరుణ్. ఫోన్ నెంబరు మీది ఇచ్చింది. మీరు వచ్చి ఐడెంటిఫై చేయాలి."

అరుణ్‌కి ఒక్కసారి గుండె ఆగినంత కంగారు, మళ్ళీ రిలీఫ్ వచ్చాయి.

"ఓ.కే. ఈజ్ షి ఆల్‌రైట్?"

"అమె బాగానే వున్నారు. కారు ఎక్కడో పాడయిందంటున్నారు. దారిలో నడుస్తూంటే పడిపోయానంటున్నారు."

"థాంక్యూ ఆఫీసర్. నేను వస్తున్నాను"

❁ ❁ ❁

కారు అద్దం మీద గబగబా మోత అవడంతో వులిక్కిపడి ఓ క్షణం తలపైకెత్తి చూశా శ్రవణ్.

ఇరుగ్గా వున్న కారు సీటులో ఇబ్బందికరంగా సీట్లో వెల్లకిలా పడి అతని తో పెనుగులాడుతున్న స్వప్న కూడా ఓ క్షణం ఆగింది.

అద్దానికి ఆనించి నాలుగు ముఖాలు నీడల్లా ముసుగు మనుషుల్లా చీకట్లో కారు తలుపు మీద కొడుతూ ఏవో అస్పష్టంగా అరుస్తున్నాయి.

కంగారుపడి ఇటు చూశాడు శ్రవణ్. ఈ వైపు అద్దం దగ్గర నాలుగు ముఖాలు. రియర్ విండో గ్లాస్ దగ్గర రెండు ముఖాలు.

అతనికి క్షణంలో దిమ్మతిరిగినట్లయింది. ఇంత అర్థరాత్రి కూడా వానలో కూడా ఇంతమంది ఎలా వచ్చారు? స్వప్న అసహనంగా 'లే, గెటప్ యూ బాస్టర్డ్' అని తిడుతోంది.

అతను చటుక్కున లేచి కూర్చుని కారు డోరు లాక్ చేసే చిన్న మీటని పైకి లాగాడు.

అదే అతను చేసిన తప్పు. కారు స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయుంటే బాగుండేది.

దారిన పోయే సామాన్యులు ఏంచేస్తారు – ఏదో సమాధానం చెప్పి పంపచ్చులే అనే నిర్లక్ష్యం... అసలు నా కార్లో నేను ఏదో నా పని చేసుకుంటుంటే వీళ్ళకెందుకు అనే కోపం, అతనిలో పెల్లుబికి జాగ్రత్త మరిచిపోయేట్లు చేశాయి.

"ఏయ్ ఎవరు మీరు?" అని గట్టిగా అరిచాడు.

"ముందు కారు దిగరా దొంగనా....... " అనే తిట్లతో ఇద్దరు వ్యక్తులు శ్రవణ్‌ని కారు బయటికి ఈడ్చిలాగారు. ఒకడు కారు తాళం తీసుకుని జేబులో వేసుకున్నాడు.

"ఏంట్రా నడిరోడ్డులో కారు ఆపి నువ్వుచేసే పని – సిగ్గులేదా – లం........" ఒకడు తిట్లు లంకించుకుని శ్రవణ్ చెంప ఛెళ్ళుమనిపించాడు.

మరొకడు "ఎవర్తెవే నువ్వు... అంత మదంగా ఉంటే హోటల్‌రూం తీసుకోపోయారా..... వొళ్ళు బలిసి.. కాలనీలో రోడ్డు మీద కారు ఆపి..... దొర్లుతున్నారూ....." ఇంకా నోట్లోంచి బూతులు ధారాళంగా వదిలాడు.

శ్రవణ్‌కి తల తిరిగిపోతోంది. ఎంత కోపం వచ్చినా స్వప్నకి అతన్ని చూసి కొంచెం జాలేసింది.

"ఇలాంటి బజారుదాన్ని ఎంగేజ్ చేసుకోవడం తెలుసు కాని రూమ్ తీసుకోవడం అన్నా తెలీదా" ఒకడు అంటున్నాడు. "రోడ్ల మీద శృంగారం ఏంట్రా పద పోలీస్‌స్టేషన్‌కి పద?"

"ఇలాంటి వాళ్ళవల్ల కాలనీ అంతా పాడయిపోతోంది" లిప్‌స్టిక్ వేసుకుని ధగధగలాడే చీరలో, అస్తవ్యస్తమైన జుట్టుతో ఉన్న స్వప్నని చూస్తూ అన్నాడు ఒకడు.

'ఏయ్ మిస్టర్ ఆగు. మేం డాక్టర్లం. ఏదో పేషెంటును చూడడానికి ఇక్కడ కారాపుకుని కూర్చుంటే ఏమిటీ రభస!" గట్టిగా అరిచింది స్వప్న.

"చూడరా దీని ముఖం. ఇది డాక్టరంట. వీడు ఎక్కడో బేరం కుదుర్చుకుని తీసుకువచ్చి పైసలు మిగుల్తాయని కార్లోనే లాగించేద్దామని చూస్తున్నాడు."

"యూ ఇడియట్స్. ఎవరు మీరు అసలు మమ్మల్ని కొశ్చన్ చేయడానికి?" అని శ్రవణ్ కోపంగా అరిచాడు.

వాళ్ళందరూ స్టూడెంట్స్‌లా వున్నారు. ఇనుమడించిన కోపంతో శ్రవణ్ చుట్టూ మూగి దెబ్బలు కొట్టసాగారు.





ఒకడు స్వప్నని ఉద్దేశించి, "పదవే పోలీస్‌స్టేషన్‌కి పద. బ్రోతల్ కేసు పెడితే అసలు రంగు బయటపడుతుంది.." అన్నాడు నెమ్మదిగా...

అంత బాధలోనూ శ్రవణ్ మెదడు వేగంగా పనిచేయసాగింది. పోలీస్ స్టేషన్‌కి వెళ్తే ఎంత రభస! ఏమని చెప్పాలి?

"పద పోలీస్‌స్టేషన్‌కి... పద.. అక్కడే అంతా చెబుతాం. పద శ్రవణ్ పోలీస్ స్టేషన్‌కి పోదాం. వీళ్ళ దౌర్జన్యం ఏమిటో అక్కడే తెలుస్తుంది. మేం కూడా మర్యాదస్తులమే! వీళ్ళ మీదే కేసు పెడదాం పదా!" అన్నది స్వప్న కోపంగా తారాస్థాయిలో అరుస్తూ.

'శ్రవణ్ దెబ్బలు చేతుల్తో ఆపుకుంటూ అనుకున్నాడు. ఈమెకిపుడు కూడా ఎంత ధైర్యం. ఎంతగా దబాయిస్తోంది!'

స్వప్న అంటోంది. అతను మా హాజ్బెండ్ డాక్టర్. ఎవరో పేషెంటు ఇల్లు వెదుకుతూ కారు ఆపి రోడ్డు పక్కన ఆగితే ఇంత గలభా చేస్తారా? మా కారు, మా ఇష్టం! మీరెవరు అడగడానికి.?"

వాళ్ళు కొంచెం బెదిరారు.

శ్రవణ్ ఆలోచిస్తున్నాడు – 'పోలీస్‌స్టేషన్‌కి వెళితే తాము చెప్పింది అబద్ధమని క్షణంలో రుజువవుతుంది. ఒక్క టెలిఫోన్ కాల్ ఇంటికి చేస్తే చాలు. అటు స్నేహితుడు డాక్టర్ అరుణ్, ఇటు తన భార్య ఇద్దరికీ సంగతంతా తెలిసిపోతుంది. అంతా అభాసుపాలవుతుంది. ఏం సమాధానం చెప్పుకోవాలి? ఈ స్వప్న పిచ్చి ప్రవర్తన ఏమిటో అర్థం చేసుకోలేక ఇప్పుడు ఎలాంటి రిస్క్‌లో పడ్డాడు.'

"బాబూ వదిలేయండి. మా దారిన మేం పోతాం. ఎందుకొచ్చిన గొడవ – పోలీసులూ అదీ అవన్నీ ఎందుకు" అని ప్రాథేయపడ్డాడు చేతులు జోడించి.

స్వప్న ఆశ్చర్యంగా చూస్తోంది. శ్రవణ్‌కి ఇంత భయం ఉంటుందని అనుకోలేదు. "ఏమవుతుంది శ్రవణ్ పద పోదాం స్టేషన్‌కి వీళ్ళకి బుద్ధి చెప్పాలి" అంటోంది.

చుట్టు మూగిన వాళ్ళల్లో ఒకడు, "పోనీరా. నాలుగు దెబ్బలు తగిలించాం– చాల్లే వదిలేయ్!" అన్నాడు.

"నా కార్ కీస్" ప్రాథేయపడ్డాడు శ్రవణ్. ఆ కుర్రాళ్ళు కాసేపు అతని కీస్ ఇవ్వకుండా ఏడిపించి, "చివరికి, తీసుకోపోరా?" అని చేతిలో పెట్టి అతన్ని కారు కేసి నెట్టారు.

'బతుకుజీవుడా' అని అతను, "రా స్వప్నా పోదాం" బలహీనంగా అని కారు స్టార్ట్ చేశాడు.

స్వప్న కారెక్కి కూర్చుంది. చుట్టూ మూగిన స్టూడెంట్స్ అంతా 'హోహో' అని వెక్కిరిస్తూ హాహాకారాలు చేస్తుంటే కారు కదిలింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=630**